సాక్షి
జనగామ

మంగళవారం | 31 | అక్టోబర్ | 2023

I



పెండింగ్ పనులు పూర్తి చేయాలి

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు సూచించారు.

-IIలో▸



క్రీడల్లో గెలుపోటములు సహజం

క్రీడల్లో గెలుపోటములు సహజమని టీఎస్ జెన్‌కో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ రమేష్ అన్నారు.

-IIలో▸

గరిష్ఠం/కనిష్ఠం
31°/19°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉదయం మంచు కురుస్తుంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

పోలింగ్‌కు కసరత్తు

మూడు నియోజకవర్గాల్లో పీఓ, ఏపీఓలకు శిక్షణ

- పాలకుర్తిలో ముగిసిన ట్రైనింగ్
- రెండు రోజుల పాటు 1,490 మంది హాజరు

జనగామ: తెలంగాణ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమయ్యారు. పోలింగ్ ఆఫీసర్లు(పీఓ), అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు (ఏపీఓ)ల నియామకం పూర్తి చేసి, గడిచిన రెండు రోజులుగా శిక్షణ అందిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య పర్యవేక్షణలో 11 మంది ట్రైనర్ల ఆధ్వర్యంలో 1,490 మందికి శిక్షణ ఇస్తున్నారు. జనగామ నియోజకవర్గంలో 511 (పీఓ, ఏపీఓ), స్టేషన్‌ఘన్‌పూర్‌లో 571, పాలకుర్తిలో 300 మందికి పోలింగ్ ప్రక్రియ, బీయూ, సీయూ, వీవీప్యాట్, తదితర ఎలక్షన్ నియమ నిబంధనలపై ట్రైనింగ్ ఇస్తున్నారు. ఇందులో ఒక్క పాలకుర్తి నియోజకవర్గంలో సోమవారంతో శిక్షణ ముగిసింది. ఉదయం 9 నుంచి 11, 11.15 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ, 2 నుంచి 3.15 వరకు ఈవీఎంల ప్రదర్శన, 3.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పీఓ, ఏపీఓలకు పరీక్ష, 5 గంటల వరకు పరీక్షపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మురళీకృష్ణ, జెడ్పీ సీఈఓ అనిల్, ఇతర ఉన్నతాధికారులు వినోద్‌కుమార్, ఇస్మాయిల్, రామ్, తదితరులు ఉన్నారు.

పోలింగ్‌కు ఒక్క రోజు ముందు..

ప్రతి పోలింగ్ స్టేషన్‌లో పీఓ,ఏపీఓ, ఓపీఓ ముగ్గురు విధులు నిర్వర్తిస్తారు. పోలింగ్‌కు ఒక్కరోజు ముందు అంటే నవంబర్ 29వ తేదీ ఉదయం 7 గంటల వరకు ఎన్నికల అధికారులు, సిబ్బంది జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలి. పోలింగ్ సిబ్బంది, సెక్టార్ ఆఫీసర్ల ఫోన్ నంబర్లను తీసుకోవాలి. ఎన్నికల సామగ్రిని తీసుకుని, పోలింగ్ కేంద్రాల వారీగా కేటాయించిన వాహనంలో వెళ్లాలి. అదేరోజు సాయంత్రం పోలింగ్ స్టేషన్ లోపల, ఎంట్రీ, ఎగ్జిట్ వైపు సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలి. అలాగే పోటీ చేస్తున్న అభ్యర్థుల గుర్తులు కలిగి ఉన్న ఫారం-7ను పీఎస్ బయట అతికించాలి. వెలుతురు ఎక్కువగా ఉండే ప్రదేశంలో వీవీప్యాడ్‌లను ఉంచకూడదు. ఒక పార్టీ తరుపున ఒకరిని మాత్రమే ఏజెంటుగా అనుమతిస్తారు. సంబంధిత పోలింగ్ స్టేషన్‌లో ఈయన ఓటరుగా నమోదై ఉండాలి. ఏజెంట్లు పోలింగ్ స్టేషన్‌కు ఉదయం 5.15 గంటలకు చేరుకోవాలి. మధ్యాహ్నం 3. గంటల తర్వాత ఏజెంటును బయటకు వెళ్లేందుకు అనుమతించకూడదు.

మాక్‌పోల్ ఎలా..

పోలింగ్ రోజు వీవీప్యాట్‌ను ట్రాన్స్‌పోర్టు మోడ్ నుంచి వర్కింగ్ మోడ్‌కు తీసుకు వచ్చిన తర్వాత, సీయూని ఆన్‌చేయగానే..అది కాస్తా ఆటోమేటిక్‌గా సెల్ఫ్ చెక్ చేసుకుని, తేదీ, సమయం చూపిస్తుంది. అలాగే పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య అందులో డిస్‌ప్లే అవుతుంది. తర్వాత ఈవీఎం రెడీగా ఉన్నట్టు నిర్ధారించిన తర్వాత, సీయూ, బీయూ, వీవీప్యాట్‌కు సంబంధించి 7 స్లిప్స్ బయటకు వస్తాయి. ఉదయం 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి, నోటాతో కలుపుకుని 50 ఓట్లు వేయాలి. ఏజెంట్లు సమయానికి రాని పక్షంలో 15 నిమిషాల పాటు వేచి చూసి, అప్పటికి వచ్చే పరిస్థితి కనిపించక పోవడంతో వీడియో చిత్రీకరణ పర్యవేక్షణలో ఎన్నికల సిబ్బంది మాక్ పోల్ నిర్వహించాలి. మాక్‌పోల్ నిర్వహించిన సమయంలో అభ్యర్థుల వారీగా వేసిన ఓట్లను నోట్ చేసేకుని, మొత్తంగా వాటిని బ్లాక్ కవర్‌లో ఉంచి, దానిపై మాక్‌పోల్ స్టాంపు వేసి, సీల్ చేయాలి. క్లియర్ చేసిన వీవీప్యాట్‌ను ఏజెంట్లకు చూపించి, సీల్ చేయాల్సి ఉంటుంది. మాక్‌పోల్ పూర్తయిన తర్వాత, సీయూలో సీఆర్‌సీ క్లియర్ చేయాలి.

గోప్యత పాటించాలి..

పోలింగ్ కేంద్రంలో ఓటరు ఓటు యొక్క గోప్యతను పాటించని పక్షంలో అతనిని ఓటు వేయడానికి అనుమతించరాదు. ఓటరు స్లిప్‌ను తీసుకుని, 17ఏలో నమోదు చేస్తే, రిమార్కు కాలమ్‌లో పొందు పరిచి, పీఓ సంతకం చేయాల్సి ఉంటుంది. అంధత్వం, పార్టీ చిహ్నాలు గుర్తించలేని స్థితిలో ఉన్న ఓటర్లకు సహాయకులుగా ఒకరిని అనుమతిస్తారు. వీరు 18 ఏళ్లు నిండి, ఏదైనా ఒక గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలి. వయస్సు తక్కువ ఉన్న వారు ఓటు వేసేందుకు వచ్చిన సమయంలో పోలింగ్ ఏజెంట్లు చాలెంజ్ చేయవచ్చు. ఈ విషయంలో ఎలక్షన్ కమిషన్ నిబంధనలు పాటిస్తూ, విచారణ చేయాలి.



జనగామలో ఈవీఎంల పనితీరుపై అవగాహన

పోలింగ్ అధికారుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ: జిల్లాలో జరుగబోయే సాధారణ ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్ శివలింగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం పీఓ, ఏపీఓ, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతుల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలను నిర్వహించేందుకు పోలింగ్ అధికారులు అంకిత భావంతో పని చేయాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు అన్ని పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాలో పోస్టల్ బ్యాలెట్, చనిపోయిన ఓటర్లు, తదితర వివరాలను మార్క్ చేయబడి ఉంటుందని, ఓటు వేయడానికి వచ్చే ఓటరు వద్ద నుంచి మొదటి ప్రాధాన్యత ఎపిక్ కార్డుతో పాటు 12 రకాల ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డులను పరిగణలోకి తీసుకోవచ్చున్నారు. పోలింగ్‌కు ఒక్కరోజు ముందు ఎలక్షన్ సామగ్రి తీసుకున్న తర్వాత, పీఎస్‌లో అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ, ఎన్నికల నోడల్ అధికారులు అనిల్‌కుమార్, కె.రాము, వినోద్ కుమార్, చౌడేశ్వరి, ప్రిన్సిపాల్ నర్సయ్య, తహసీల్దార్లు ఎం.మహిపాల్‌రెడ్డి, నాగదివ్య, శ్రీనివాస్‌రెడ్డి, పీఓలు, ఏపీఓలు తదితరులు ఉన్నారు.

ఉదయం 7 గంటలకే..

ప్రిసైడింగ్ ఆఫీసర్ ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించాలి. అంతకు ముందు ఏజెంట్ల సంతకం తీసుకోవాలి. ఆధార్, ఈజీఎస్ జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతా, పాస్‌పోర్టు, లేబర్ హెల్త్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఆర్‌జీఐ అండర్ ఎన్‌పీఆర్ స్మార్ట్ కార్డు, ఫొటోతో కలిగి ఉన్న పెన్షన్ డ్యాక్యుమెంటు, సర్వీసు ఐడెంటిటీ కార్డుల ద్వారా ఓటింగ్‌కు అవకాశం కల్పించాలి. ఓటరు ఓటు వేసి, బయటకు వెళ్లే వరకు సంబంధిత పోలింగ్ అధికారులు గమనించాలి. ప్రతి రెండు గంటలకు ఒకసారి పీఎస్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలను సెక్టార్ ఆఫీసర్‌కు సమాచారం అందించాలి. పోలింగ్ ప్రారంభమైన తర్వాత వీవీప్యాట్ పనిచేయని పక్షంలో దానిని మాత్రమే మార్చాలి. ఒకవేళ బీయూ, సీయూ పనిచేయకుంటే, పూర్తి సెట్‌ను మార్చాల్సి ఉంటుంది. వాటిని మార్చిన తర్వాత మరోసారి మాక్‌పోల్ నిర్వహించి, ఒక్క ఓటు మాత్రమే వేయాలి. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత సీయూను క్లోజ్ చేసి, బీయూ, సీయూ, వీవీప్యాట్‌ను వేరు చేసి స్విచ్‌ఆఫ్ చేయాలి. వీవీప్యాట్ నుంచి బ్యాటరీని తొలగించి, నాబ్‌ను ట్రాన్స్‌పోర్టు మోడ్ చేయాలి. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది.

కవాతులో పాల్గొన్న కేంద్ర బలగాలు



కేంద్ర బలగాల కవాతు

తరిగొప్పుల: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలకేంద్రంలో బీఎస్‌ఎఫ్ బలగాలు సోమవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలీసులు భద్రత కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సాయిరమణ, ఎస్సైలు దూదిమెట్ల నరేష్, సతీష్, శ్రీకాంత్, ఏఎస్సై గౌస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమాల గడ్డలో..

దేవరుప్పుల: ఉద్యమాల గడ్డ కడవెండిలో పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. సోమవారం మండలంలోని కడవెండి, కోలుకొండ, రామచంద్రాపురంలో ఎస్సై కొంగ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా కొనసాగేందుకు సందేశాన్ని తెలిపేందుకు పోలీసు బలగాలు ప్రదర్శన చేసి అవగాహన కల్పించారు.



దేవరుప్పుల: కడవెండిలో..

పోరాటాల అడ్డ.. పరకాల గడ్డ..

- 1952లో నియోజకవర్గంలో తొలిసారి ఎన్నికలు
- కాంగ్రెస్ 5సార్లు గెలుపు.. టీడీపీ, బీఆర్‌ఎస్‌లు రెండేసి సార్లు
- మహిళా ఓటర్లే అధికం
- 2009లో జనరల్ కేటాయింపు

-IIలో▸

స్వాధీనం చేసుకున్న నగదు డీజీసీకి అప్పగింత

న్యూస్‌రీల్

దళారుల చేతుల్లో మోసపోవద్దు



జనగామ రూరల్: దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించాలని పీఏసీఎస్ సీఈఓలు రాంమ్మోహన్, భాస్కర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని సిద్దెంకి, గానుగుపహాడ్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. దళారుల చేతుల్లో మోసపోకుండా మద్దతు ధర పొందేందుకే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తేమ శాతం 17 వచ్చేలా చూసుకొని ధాన్యం కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

‘అమలు కాని హామీలతో మోసం’



తరిగొప్పుల: అమలు కాని హామీలతో కేసీఆర్ ప్రజలను మోసం చేశారని బీజేపీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం మోదీ రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తే సీఎం కేసీఆర్ కాళేశ్వరానికి మళ్లించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, బండ ప్రసాద్, చౌడ రమేష్, ఉడుగుల రమేష్, దేవరాయ ఎల్లయ్య, బానోతు రాంకోఠి, అల్‌పతి నాయక్, సురేష్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, ఏడెల్లి రాంనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో ఇన్నోథాన్-23



కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్ హిటాచీ ఎనర్జీ ఇండియా సౌజన్యంతో సోమవారం ఎనర్జీ ఇన్నోవేషన్ హ్యాకథాన్ పేరిట ఇన్నోథాన్-23 నిర్వహించారు. హిటాచీ ఎనర్జీ.. నిట్ వరంగల్‌లో ఇటీవల ప్రారంభించిన స్మార్ట్ ఎలక్ట్రిక్ గ్రిడ్ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన హ్యాకథాన్‌లో 27 టీంలు పాల్గొని ‘ఫ్యూచర్ ఆఫ్ ఎనర్జీ ఫర్ ఆల్’ అనే అంశంపై పరిశోధనలు చేపట్టాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హిటాచీ సంస్థ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు

అవినీతి రహిత సమాజాన్ని స్థాపించాలి

దామెర: అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పవర్‌గ్రిడ్ డీజీఎం, స్టేషన్ ఇన్‌చార్జ్ డి.సమ్మయ్య పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఒగ్లాపూర్ పవర్ గ్రిడ్ ఆధ్వర్యంలో గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని నవంబర్ 6 వరకు చేపట్టే విజిలెన్స్ వారోత్సవాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవినీతి వద్దు-దేశానికి కట్టుబడి ఉండాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ సత్తిబాబు, అసిస్టెంట్ మేనేజర్ శ్యాంసుందర్, ఒగ్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపెల్లి శ్రీధర్‌రెడ్డి, కిన్నెర రమేష్, పవర్‌గ్రిడ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ అనుమతికి దరఖాస్తులు

వరంగల్ క్రైం: దీపావళి సందర్భంగా తాత్కాలికంగా బాణసంచా విక్రయాలకు అనుమతి కోసం వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ అధికారులు జారీ చేసిన ఎన్‌ఓసీ, ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటు చేయదలిచితే స్థల యజమాని అనుమతి పత్రం, ప్రభుత్వ స్థలాల్లో అయితే సంబంధిత ప్రభుత్వ అధికారుల అనుమతి పత్రం ఉండాలని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అదాలత్ శాఖలో రూ.800 చాలాన్ చెల్లించాల్సి ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు నవంబర్ 6 లోపు ఆయా జోన్ల డీసీపీ స్థాయి అధికారులకు దరఖాస్తులు అందజేయాలని వివరించారు.

దొంగల మాటలు నమ్మొద్దు

- ఎంపీ మాలోత్ కవిత



బతుకమ్మ ఎత్తుకున్న ఎంపీ కవిత

నర్మెట: ఎన్నికలొచ్చాయి...ఓట్ల కోసం వచ్చేకొందరు దొంగలు ఏవేవో గారడి మాటలు చెపుతారని, ప్రజలు వాటిని నమ్మొద్దని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. సోమవారం మండలంలోని గండి రామారం, డీసీ తండా, మన్సింగ్ తండా, ఆగపేట, ఇసుకబాయితండా, మచ్చుపహాడ్, లోక్యాతండా, బండతండాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జ్ తాటికొండ రాజయ్యలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కవిత మాట్లాడారు. మూడో సారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేసి రాష్ట్రాన్ని మరింత ఆదర్శంగా నిలపాలన్నారు. కాగా ఆయా గ్రామాల్లో బతుకమ్మలతో ఎంపీకి ఘన స్వాగతం పలికారు. మండల శాఖ అధ్యక్షుడు చింత కింది సురేష్, ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు గద్దల నర్సింగారావు, ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ తేజావత్ గోవర్దన్, జెడ్పీటీసీ మాలోత్ శ్రీనివాస్, ఎండీ గౌస్, సుధాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసేందుకే వచ్చాం..

- కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి యశస్విని



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: ఉన్నత విద్య చదివి విదేశాల్లో స్థిరపడిన తమ కుటుంబం పాలకుర్తి ప్రజలకు సేవచేసేందుకు స్వదేశానికి వచ్చామని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మామిడాల యశస్విని, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం దేవరుప్పుల, కొడకండ్ల మండలాల మీదుగా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యతో కలిసి భారీ ర్యాలీతో పాలకుర్తికి చేరుకున్నారు. ముందుగా సోమశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పౌరసత్వ రాకుండా దుష్ట శక్తులు అడ్డుకున్నాయని, ప్రత్యర్థులు తనకు పౌరసత్వం రాకుంటే విమానం ఎక్కడం ఖాయమంటే.. ఇంకొక విమానంలో నా కోడలు దిగిందని.. ఇప్పుడు ఇద్దరం కలిసి ప్రజాప్రతినిధిగా, ట్రస్ట్ రూపంలో సేవచేసే అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీమాజీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వర రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు వడ్లకొండ తార, జిల్లా నాయకులు అనుముల మల్లారెడ్డి, జలగం కుమార్, వెంగల్‌రావు, పాలకుర్తి, దేవరుప్పుల కొడకండ్ల పార్టీ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, పెద్ది కృష్ణమూర్తి, దారావత్ సురేష్ నాయక్, రాజేష్ నాయక్, హరీష్, భార్గవ్, శ్రీశైలం, డాక్టర్ జీవై సోమయ్య, అనిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమాధికారిపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జనగామ రూరల్: ఎన్నికల నిబంధనలు పాటించకుండా కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ పోస్టులు భర్తీ చేసిన గిరిజన సంక్షేమాధికారిపై చర్య తీసుకోవాలని నిరుద్యోగులు, గిరిజన సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఏఓ మన్సూరి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. గిరిజన పాఠశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతికి నోటిఫికేషన్ లేకుండా సీఆర్టీ నియామకాలు చేపట్టడం సరికాదన్నారు. జూన్ 5 తేదీ రాష్ట్ర వ్యాప్తంగా 48 సీఆర్టీ పోస్టులు మంజూరు చేశారు. ఇందులో జిల్లాకు సంబంధించి 6 పోస్టులు ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా అక్టోబర్ 10 తేదీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా 11, 12 తేదీల్లో సీఆర్టీలు విధుల్లో చేరారు. అక్టోబర్ 7వ తేదీన ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎక్కడ ఖాళీలు లేవని తెలిపారన్నారు. కమిషనర్ ఆదేశాలు బేఖాతరు చేస్తూ ఐటీడీఏ పీఓకు తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ డీటీడీఓ ప్రేమ కళ, నర్మెట మండలం హెచ్‌ఎం సారయ్యలను సస్పెండ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు సురేష్, చందు నాయక్, దేవ నాయక్, ధర్మభిక్షం, రామ్ ప్రసాద్, మల్లేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- కేంద్ర ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ శివలింగయ్య, ఉన్నతాధికారులు

జనగామ: తెలంగాణలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కేంద్ర ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ అన్నారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి, రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో నవంబర్ 3వ తేదీన అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కోసం ఆర్‌ఓ కార్యాలయంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రిటర్న్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ సమయంలో సమయ పాలన పాటించేందుకు ఒకే గడియారం ఫాలో కావాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థికి ఓటరు జాబితా వివరాలను ఇవ్వాలన్నారు. స్వతంత్ర అభ్యర్థులతో పాటు గుర్తింపు లేని పార్టీల వారికి గుర్తులు కేటాయించే సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ, తాజాగా అందుబాటులో ఉన్న ఫ్రీ గుర్తులను మాత్రమే కేటాయించాలని సూచించారు. సీ విజల్ యాప్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. తనిఖీల్లో నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని, జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ ప్రతి రోజు వచ్చే ఆఫీర్లపై చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. నవంబర్ 3 నుంచి ఎన్నికల పరిశీలకుల క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందని పేర్కొన్నారు. వీసీలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఎన్నికల నోడల్ అధికారులు ఇస్మాయిల్, వినోద్ కుమార్, రాంప్రసాద్, దుర్గారావు, ఏఓ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



హన్మకొండ కల్చరల్ : హనుమకొండ శ్రీరుద్రేశ్వర స్వామి ఆలయంలో ఆశ్వయుజ బహుళ విదియ సోమవారం సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

శ్వేతార్కుడికి పెరుగుతో అభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకులు

కాజీపేట: కాజీపేటలోని స్వయంభు శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో సోమవారం స్వామి వారికి పెరుగుతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయిన వోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నపూర్ణ భవనంలో భక్తులకు మహాన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు అయినవోలు అనంతమల్లయ్య శర్మ, దేవులపల్లి సదానందం, శనిగరపు రాజ్‌మోహన్, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్, దుర్గం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

‘రిమోట్’ మోసం

- రూ.100 ఎరవేసి.. తూకంలో 15 కిలోలు కోత
- గుర్తించిన పత్తి రైతులు..
- మోసగాడికి దేహశుద్ధి






కాంటా వేసిన పత్తి, రిమోట్ ఆపరేషన్ తర్వాత నమోదు

హసన్‌పర్తి: కాంటాలో సాంకేతిక పరికరాన్ని ఉపయోగించి రిమోట్ ఆపరేషన్ సహాయంతో తూకంలో మోసం చేస్తున్న ఓ దళారీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. తమను మోసం చేశాడని ఆగ్రహంతో రైతులు ఆ వ్యక్తికి దేహశుద్ధి చేసిన ఘటన హసన్‌పర్తి మండలం నాగారంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాలకు చెందిన ప్రైవేట్‌గా వ్యాపారి గడ్డం వెంకటేశ్వర్లు పరకాల, సూదెన్‌పల్లి, పెంబర్తి, అంబాల, కమలాపూర్, శ్రీరాములపల్లి గ్రామాల్లో రైతుల ఇళ్లకు వెళ్లి అక్కడే పత్తి తూకం వేసి వెంటనే డబ్బులు చెల్లిస్తున్నాడు. మార్కెట్ ధర కంటే మరో రూ.100 అదనంగా చెల్లిస్తుండడంతో రైతులు ముందుకు వచ్చారు.

మోసాన్ని గుర్తించింది ఇలా..

సోమవారం ఉదయం నాగారంలోని రాజిరెడ్డి ఇంటికి కర్ణాకర్ వచ్చి పత్తి కాంటా వేశాడు. తొలుత 92.6 కిలోల తూకం వచ్చిన పత్తి.. సెకండ్ల వ్యవధిలోనే 74.1 కిలోలకు చేరింది. దీంతో రాజిరెడ్డి కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి గుమస్తా చేతులను పరిశీలించగా రిమోట్ దొరికింది. దీనిని సదరు దళారీ ఎలక్ట్రానిక్ కాంటాను రిమోట్ కనెక్షన్ ఇచ్చాడు. పత్తి తూకం వేసినప్పుడు జేబుల్లో నుంచి ఒకసారి రిమోట్ ద్వారా ఆపరేట్ చేస్తే 15 కిలోలు, రెండుసార్లు చేస్తే 30 కిలోలు తక్కువ తూకం వచ్చేలా కాంటాలో సాంకేతిక పరికరాన్ని బిగించి రిమోట్‌కు అనుసంధానం చేశాడు. ఇది ఆపరేషన్ చేయడంతో తూకంలో తేడాను గమనించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన కర్ణాకర్‌ను రైతులు అదుపులోకి తీసుకుని విచారించగా.. తన యజమాని వెంకటేశ్వర్లు సూచనల మేరకు రిమోట్ వాడుతున్నట్లు తెలిపారు. అప్పుడే అక్కడికి చేరిన వెంకటేశ్వర్లను రైతులు దేహశుద్ధి చేశారు.



వేలకొద్దీ నీతులు బోధించే బదులు
ఒక మంచి పని చేసి
చూపించింది మేలు.
- మహాత్మాగాంధీ

ఈ ముచ్చటెరుకనా?

ఓటింగ్ ఎలా ఉంటుందంటే...!



కాజీపేట: సాధారణంగా మనదేశంలో శాసన సభ లేదా లోక్‌సభలో ఒక బిల్లు ఆమోదం పొందాలంటే మెజారిటీ ఓట్లు ఉండాలనే మాట వింటూ ఉంటాం. అంటే ఆ రోజు సభలో ఉండి ఓటు వేసిన వారిలో సగం కన్నా ఎక్కువ వస్తే చాలు. అయితే ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు మాత్రం ఇలా ఉండదు. దేశంలోని ఓటింగ్ పద్ధతిని ఫస్ట్-పాస్ట్-ద పోస్ట్ అంటాం. దీనినే ప్లూరాలిటీ అని కూడా అంటారు. ఈ విధానాన్ని సులువుగా చెప్పాలంటే పరుగు పందెంలో ఎవరైతే ముందు చేరుకుంటారో వారే గెలిచినట్లు. వందశాతం ఎప్పుడూ లేదు. మన దేశంలో ఎప్పుడూ వంద శాతం పోలింగ్ జరిగిన దాఖలాలు లేవు. ఉదాహరణకు 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలుచుకున్న మొత్తం ఓట్లు 37.36 శాతం మాత్రమే. అంటే దేశంలో 62.64 శాతం మంది ప్రజలు ఈ ప్రభుత్వాన్ని వద్దనుకున్నట్టే లెక్క. మిగతా ఓట్లను అన్ని రాజకీయ పక్షాలు పంచుకున్నాయి. వీరందరి కంటే ఎక్కువ ఓట్లు బీజేపీ అభ్యర్థులే దక్కించుకోవడంతో ఎక్కువ సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగాయి.

వినూత్న ప్రచారం..

అరగుండు, అర మీసంతో కనిపిస్తున్న ఇతని పేరు తాటికాయల యాకయ్య. జఫర్‌గఢ్ శివారు వడ్డెగూడెం గ్రామానికి చెందిన యాకయ్య కాంగ్రెస్ అభిమాని. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తాను అరగుండు, అర మీసంతో ప్రచారం చేస్తానని స్పష్టం చేశారు.

-జఫర్‌గఢ్



ప్రచారం నిర్వహిస్తున్న యాకయ్య

జంగ్ తెలంగాణ

రూ. 17.54 లక్షల నగదు స్వాధీనం..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు చేపట్టి ఆధారం లేకుండా తరలిస్తున్న రూ. 17.54 లక్షలు, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు.

ఉప్పరిగూడెం స్టేజీ వద్ద రూ.84 వేలు ..



నగదుతోపాటు చెక్కును స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై రమాదేవి

కురవి: ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.84 వేలు, రూ.28వేల విలువైన చెక్కును స్వాధీనం చేసుకున్నామని సీరోలు ఎస్సై ఎం.రమాదేవి సోమవారం రాత్రి తెలిపారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన సయ్యద్ వసీమ్ అక్రమ్ కేసముద్రం నుంచి ఖమ్మం వైపునకు వాహనంలో వెళ్తుండగా సీరోలు మండలం ఉప్పరిగూడెం స్టేజీ వద్ద తనిఖీ చేసినట్లు తెలిపారు. ఇందులో ఆధారం లేని రూ.84, 800, రూ.28 వేల విలువైన చెక్కును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఖానాపురంలో రూ.2 లక్షలు..

ఖానాపురం: చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.2,11,000 లభించినట్లు ఎస్సై మాధవ్ తెలిపారు. ఖమ్మం జిల్లా బల్లునగర్ గ్రామానికి చెందిన గుగులోత్ మోహన్ ఆధారం లేకుండా రూ.2,11,000 నగదు తరలిస్తుండగా సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

వంతడపల వద్ద రూ. లక్ష..

నర్సింహులపేట: మండలంలోని వంతడపల, పెద్ద నాగారం స్టేజీల వద్ద పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వంతడపల స్టేజీ వద్ద నర్సింహులపేటకు చెందిన ఓ వ్యక్తి బ్యాగును తనిఖీ చేయగా రూ. లక్ష నగదు లభ్యమైంది. ఈ నగదుకు ఆధారం చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నామని ఎస్సై గండ్రాతి తెలిపారు.

క్లాంలో రూ.9.50 లక్షలు..



స్వాధీనం చేసుకున్న నగదును సీజర్ టీమ్‌కు అప్పగిస్తున్న పోలీసులు

లింగాలఘణపురం: మండలంలోని క్లాం కమాన్ వద్ద జనగామ పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.9.50 లక్షలను జనగామ సీఐ శ్రీనివాస్‌యాదవ్, ఎస్సై సుజన్‌కుమార్ సీజ్ చేసి సీజర్ టీమ్‌కు అప్పగించారు. పత్తి వ్యాపారి బచ్చు పవన్‌కుమార్ తన వ్యక్తిగత ఖాతా నుంచి రూ.9.50 లక్షలు డ్రా చేసి ఆధారం లేకుండా తీసుకెళ్తుండగా పోలీసులు సీజ్ చేశారు.

పరకాలలో రూ.3 లక్షలు..



స్వాధీనం చేసుకున్న నగదుతో పరకాల సీఐ వెంకటరత్నం


పరకాల: పరకాల శివారులోని చలివాగు చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు మహిళల వద్ద రూ.3 లక్షల నగదు లభ్యమైంది. ఈ నగదుకు ఆధారం లేకపోవడంతో స్వాధీనం చేసుకుని పరకాల ట్రెజరీ కార్యాలయానికి తరలించినట్లు సీఐ వెంకటరత్నం తెలిపారు.

డీజీసీకి నగదు అప్పగింత

కాజీపేట/ మడికొండ/ ధర్మసాగర్: కాజీపేట శివారులో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్ పోస్టు వద్ద సోమవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధారం లేకుండా తరలిస్తున్న 8.61 తులాల బంగారం, రూ.1,9,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ పర్యవేక్షణలో సీఐ సార్ల రాజుతో కలిసి సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఇందులో హనుమకొండ ప్రాంతానికి చెందిన తీర్థల శ్రీనివాస్ వద్ద నగదు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కిరణ్ మందావి అనే మహిళ వద్ద బంగారం స్వాధీనం చేసుకుని జనగామ డీజీసీ అధికారులకు అప్పగించారు. కాగా, పోలీసులు.. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ప్రయాణిస్తున్న కారులో సోదాలు చేశారు.

పోరాటాల అడ్డ.. పరకాల గడ్డ..

- 1952లో నియోజకవర్గంలో తొలిసారి ఎన్నికలు
- కాంగ్రెస్ 5సార్లు గెలుపు.. టీడీపీ, బీఆర్ఎస్‌లు రెండేసి సార్లు
- మహిళా ఓటర్లే అధికం
- 2009లో జనరల్‌కు కేటాయింపు





ఆత్మకూరు : పరకాల.. పోరాటాలకు అడ్డ. నిత్య చైతన్యానికి గడ్డ. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులను నిరంతరం ప్రశ్నించడం.. ప్రజారంజక పాలన సాగిస్తున్న ప్రజాప్రతినిధులను గుండెల్లో నిలుపుకోవడం ఇక్కడి ప్రజలకే చెందుతుంది. అందుకే అన్ని రాజకీయ పార్టీలు ఇక్కడ గెలుపొందడానికి సర్వశక్తులు ఒడ్డుతాయి. ఈ క్రమంలో పరకాల నియోజకవర్గంలో 1952లో తొలిసారి శాసనసభ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పీపుల్స్ డెమోక్రటిక్ (పీడీఎఫ్) అభ్యర్థి గోపాల్‌రావు మొదటి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

మొదటి నుంచి ఎస్సీ...2009లో జనరల్..

పరకాల అసెంబ్లీ మొదట ఎస్సీ రిజర్వ్. 2009 ఎన్నికల్లో జనరల్ అయింది. అయితే 2009 నుంచి జనరల్ అయినా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులే పోటీపడ్డారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖ బీఆర్ఎస్ అభ్యర్థి మొలుగూరి భిక్షపతిపై 12వేల 800ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.అలాగే, 2012 ఉప ఎన్నికలో కూడా వీరే తలపడగా మొలుగూరి భిక్షపతి.. కొండా సురేఖపై 1562 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.ఈ ఎన్నికల్లో సురేఖ వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేశారు. కాగా, 2018లో ఇద్దరు జనరల్ అభ్యర్థులు తలపడ్డారు.టీడీపీ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి.. బీఆర్ఎస్ అభ్యర్థి ముద్దసాని సహోదర్‌రెడ్డిపై గెలుపొందారు.అలాగే, 2014లో బీఆర్ఎస్ నుంచి పోటీచేసిన ధర్మారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి సురేఖపై గెలుపొందారు.

పెరిగిన ఓటర్లు...

పరకాల నియోజకవర్గంలో 1957లో 90,942 ఓటర్లు ఉండగా 1985లో లక్షా7వేల 431కి చేరింది. 2004లో లక్షా14వేల 504 ఉండగా 2018లో లక్షా77వేల691కు చేరుకుంది. ప్రస్తుతం 2లక్షల11వేల660 మంది ఓటర్లు ఉన్నారు.

మహిళా ఓటర్లు అధికం

పరకాల నియోజకవర్గంలో మహిళలదే పైచేయి. ఇక్కడ పురుషుల కంటే మహిళా ఓటర్లే 3,658 ఎక్కువ ఉన్నారు. దీంతో ఎన్నికల్లో మహిళా ఓట్లు కీలకం కానున్నాయి.

ఐదుసార్లు గెలిచిన కాంగ్రెస్..

నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 5 సార్లు గెలువగా బీజేపీ కూడా రెండుసార్లు గెలిచింది. టీడీపీ 2 పర్యాయాలు, బీఆర్ఎస్ రెండు పర్యాయాలు గెలుపొందింది.

నియోజకవర్గంలో కొత్తమండలాలు..

నియోజకవర్గంలో ఆత్మకూరు మండలం నుంచి దామెర కొత్త మండలంగా ఏర్పడగా పరకాలలో నడికూడ కొత్త మండలం ఏర్పడింది.అలాగే ఖిలా వరంగల్‌లోని 5 గ్రామాలు పరకాల నియోజకవర్గంలోకి వచ్చాయి. అత్యధికంగా సంగెం మండలంలో 33గ్రామాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 113గ్రామాలు ఉన్నాయి.

సంవత్సరం	గెలిచిన పార్టీ	అభ్యర్థి	సమీప అభ్యర్థి	మెజార్టీ
1952	పీడీఎఫ్	గోపాల్‌రావు	--------------	13వేలు
1957	కాంగ్రెస్	మంద సాయిలు	కేశవరెడ్డి(రెబల్)	1,390
1962	కాంగ్రెస్	రౌతు నర్సింహరామయ్య	నర్సింహరాజయ్య(సీపీఐ)	4,601
1967	బీజేఎస్	జంగారెడ్డి	కైలాసం(కాంగ్రెస్)	1,862
1972	కాంగ్రెస్	పింగిలి ధర్మారెడ్డి	జంగారెడ్డి(బీజేఎస్)	14,689
1978	కాంగ్రెస్	బొచ్చు సమ్మయ్య	ఒంటేరు జయపాల్(బీజేపీ)	8,787
1983	కాంగ్రెస్	బొచ్చు సమ్మయ్య	ఒంటేరు జయపాల్(బీజేపీ)	7,295
1985	బీజేపీ	ఒంటేరు జయపాల్	బొచ్చు సమ్మయ్య(కాంగ్రెస్)	1,7132
1989	బీజేపీ	ఒంటేరు జయపాల్	బొచ్చు సమ్మయ్య(కాంగ్రెస్)	1,600
1994	సీపీఐ	పోతరాజు సారయ్య	బొచ్చు సమ్మయ్య(కాంగ్రెస్)	4,598
1999	టీడీపీ	బొజ్జపెల్లి రాజయ్య	పుల్లా పద్మావతి(కాంగ్రెస్)	15,094
2004	బీఆర్ఎస్	బండారి శారారాణి	దొమ్మాటి సాంబయ్య(టీడీపీ)	34,597
2009	కాంగ్రెస్	కొండా సురేఖ	మొలుగూరి భిక్షపతి(టీఆర్ఎస్)	12,800
2012	బీఆర్ఎస్	మొలుగూరి భిక్షపతి	కొండా సురేఖ(వైఎస్సార్‌సీపీ)	1,562
2014	టీడీపీ	చల్లా ధర్మారెడ్డి	ముద్దసాని సహోదరరెడ్డి(బీఆర్ఎస్)	9,108
2018	బీఆర్ఎస్	చల్లా ధర్మారెడ్డి	కొండా సురేఖ(కాంగ్రెస్)	46,519

క్రీడల్లో గెలుపోటములు సహజం

- టీఎస్ జెన్‌కో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ రమేష్
- ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

హసన్‌పర్తి: క్రీడల్లో గెలుపోటములు సహజమని టీఎస్ జెన్‌కో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ రమేష్ అన్నారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులు నిర్వహించిన ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ క్రీడల్లో భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పోటీల ద్వారా స్నేహబంధం పెంపొందుతుందన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టెబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆకారపు హరీష్, ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం. శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ వెంకటస్వామి, పీఆర్వో డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు...

బాలికలు -సింగిల్ (అండర్-15): భాను శ్రీ, జెడ్పీఎస్ఎస్,శాయంపేట (విన్నర్), పి. లావ్య,సెయింట్ గ్యాబ్రిల్ (రన్నర్)

బాలికలు-సింగిల్(అండర్-17): దివేన, జెడ్పీఎస్ఎస్, శాయంపేట (విన్నర్), కీర్తన,జెడ్పీఎస్ఎస్, శాయంపేట(రన్నర్)



మాట్లాడుతున్న రమేష్

బాలికలు-సింగిల్(అండర్-19): దివేన, జెడ్పీఎస్ఎస్,శాయంపేట (విన్నర్), భాను శ్రీ,జెడ్పీఎస్ఎస్,శాయంపేట (రన్నర్)

పురుషుల సింగిల్: యష్,నిట్(విన్నర్స్), హార్దిక్ చౌదరి, నిట్ (రన్నర్)

మహిళలు సింగిల్: నైమీషా గిరిష్,నిట్ (విన్నర్స్),తన్మయి,వరంగల్ క్లబ్ (రన్నర్)

పురుషుల డబుల్స్: శ్రీకాంత్,విజయ్(విన్నర్స్), సవర్కార్ గాంధీ, కిరణ్‌రెడ్డి (రన్నర్)

మహిళలు డబుల్స్: నైమిషాగిరిష్, అభిజ్ఞా(విన్నర్స్),పి.ప్రణతి,లక్ష్మీనారాయణ(రన్నర్స్)

మిక్స్‌డ్ డబుల్స్: నైమిషా గిరిష్, హార్దిక్ చౌదరి (విన్నర్స్), తన్మయి, సావర్కర్ గాంధీ(రన్నర్స్) గెలుపొందారు.

ఈదులపూసపల్లిలో చోరీ..

- 11.30 తులాల బంగారం, రూ.50 వేల నగదు అపహరణ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంలో చోరీ జరిగింది. ఈ ఘటనలో 11.30 తులాల బంగారం, రూ.50 వేల నగదు అపహరణకు గురయ్యాయి. రూరల్ ఎస్సై బి.రాంచరణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర వెంకన్న కుటుంబ సమేతంగా ఆదివారం వేములవాడకు వెళ్లారు. సోమవారం ఇంటి తలుపు తాళం పగులగొట్టి ఉండగా చోరీ జరిగిందని గమనించిన స్థానికులు వారికి సమాచారం ఇచ్చారు. వెంటనే వేములవాడ నుంచి గ్రామానికి చేరుకున్న వెంకన్న కుటుంబీకులు ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలోని 11.30 తులాల బంగారం, రూ.50 వేల నగదు కనిపించలేదు. చోరీ జరిగిందని నిర్ధారణకు వచ్చిన అనంతరం రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

గార్ల: మండలంలోని అంజనాపురం గ్రామంలో సోమవారం గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి 500లీటర్ల బెల్లంపానకం, 10 లీటర్ల కాపుసారాను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు గార్ల బయ్యారం సీఐ బాబూరావు, ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ శ్యామ్, శ్రీనివాస్, సూత్రపు శ్రీను, రాము, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలో గుడుంబా ప్యాకెట్లు, 5లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. బెల్టు షాపు నిర్వహిస్తున్న బానోత్ కవిత పై కేసు నమోదు చేసినట్లు, పెద్దముప్పారం, బొడ్లాడ గ్రామాలలో 16మంది బెల్టు షాపుల నిర్వాహకులు, నాయకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.



గార్ల: గుడుంబా తయారీ సామగ్రి చూపుతున్న పోలీసులు

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



మాట్లాడుతున్న సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు సూచించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో హనుమకొండ, జనగామ, భూపాలపల్లి సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలు, డివిజన్‌లు, విభాగాల వారీగా ప్రగతిని సమీక్షించారు. వినియోగదారుల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలన్నారు. 33/11 బ్రేక్ డౌన్స్, అంతరాయాలు, ట్రిప్పింగ్స్ తగ్గించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించాలన్నారు. లైన్ పెట్రోలింగ్, సబ్‌స్టేషన్‌ల నిర్వహణ విధిగా చేపట్టాలన్నారు. ఉద్యోగులు పని చేసే చోట నివాసముండాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్ రావు, పి.గణపతి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు అశోక్ కుమార్, సదర్‌లాల్, మోహన్ రావు, కిషన్, అశోక్, బీకంసింగ్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

- రూ. 2.50 లక్షల విలువైన నరుకు స్వాధీనం

రామన్నపేట : వరంగల్ హంటర్ రోడ్డులోని ఏడు మోరీల వద్ద సోమవారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో తనిఖీ చేయగా వారి వద్ద రూ. 2.50 లక్షల విలువైన 10 కిలోల గంజాయి లభ్యమైందని ఏసీపీ బోనాల కిషన్ తెలి పారు. సోమవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని బాగ్ జహదా గ్రామానికి చెందిన నీలమని దళై, గుజరాత్‌లోని దిన్సందు సొసైటీ గ్రామానికి చెందిన సత్యబాన్ డాకువా.. ఒడిశాలోని రాయగుడలో గంజాయి కొనుగోలు చేసి సూరత్ వైపునకు వెళ్లే రైలు ఎక్కారు. ఈ గంజాయిని వరంగల్‌లో విక్రయించేందుకు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు దిగి నడుచుకుంటు వస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని తనిఖీ చేయగా 10 కిలోలు గంజాయి లభ్యమైంది. దీంతో వీరిని అరెస్టు చేసి రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. కాగా, గంజాయి విక్రయదారులను పట్టుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు కుమార్, చంద్రమౌళిని ఏసీపీ అభినందించారు.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

నర్సంపేట రూరల్ : మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం నర్సంపేట పట్టణంలోని వల్లబ్‌నగర్‌లో జరిగింది. వల్లబ్‌నగర్‌కు చెందిన కత్తి రవి (40) హైదరాబాద్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో నర్సంపేట పట్టణానికి చెందిన కుక్కమూరి సూరి, బరిగెల ఐలయ్య, శివరాత్రి స్వామి నిత్యం వీడియో కాల్స్ చేస్తూ దూషిస్తున్నారు. ఈనెల 30వ తేదీన రవి నర్సంపేటకు రావడంతో ఫోన్‌లో దూషించారు. దీంతో మనస్తాపం చెందిన రవి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి తెలిపారు.

స్పోర్ట్స్




సబలెంకా శుభారంభం

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గత ఏడాది రన్నరప్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 6–0, 6–1తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో లీగ్ మ్యాచ్‌లో జెస్సికా పెగూలా (అమెరికా) 7–5, 6–2తో రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది.

అర్జున్‌కు మూడో గెలుపు

గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం నమోదు చేశాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 68 ఎత్తుల్లో రినాత్ జుమాబయేవ్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. ఐదో రౌండ్ తర్వాత అర్జున్ నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.




ఫారూఖీ

అఫ్గాన్ తీన్‌మార్...

- శ్రీలంకపై ఏడు వికెట్లతో సంచలన విజయం
- ఒకే టోర్నీలో మూడు ప్రపంచ చాంపియన్ జట్లను ఓడించిన హష్మతుల్లా బృందం
- బంతితో మెరిసిన ఫారూఖీ
- రహ్మత్ షా, హష్మతుల్లా, అజ్మతుల్లా అర్ధ సెంచరీలు

ఇకపై తమ జట్టును కూనగా పరిగణించాల్సిన అవసరం లేదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. మేటి జట్లపై తాము సాధిస్తున్న విజయాలు గాలివాటమేమీ కాదని తమ నిలకడైన ప్రదర్శనతో నిరూపించింది. మూడోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఈసారి తమకంటే అన్ని విభాగాల్లో ఎంతో మెరుగైన జట్లను బోల్తా కొట్టిస్తూ ఔరా అనిపించింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన ఉత్సాహంతో 1992 విశ్వవిజేత పాకిస్తాన్ జట్టును కూడా మట్టికరిపించిన అఫ్గానిస్తాన్ జట్టు తాజాగా 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంకను ఓడించి అందర్నీ ఆశ్చర్యపరిచింది.

పుణే: ప్రత్యర్థి జట్టు గత రికార్డు ఎలా ఉంటేనేమి తమదైన రోజున సమష్టిగా గర్జిస్తే అద్భుత ఫలితం సాధించవచ్చని వన్డే ప్రపంచకప్ టోర్నీలో అఫ్గానిస్తాన్ జట్టు మూడోసారి నిరూపించింది. భారీ అంచనాలు పెట్టుకోకుండా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ మూడో సంచలన విజయంతో అలరించింది. 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హష్మతుల్లా షాహిది నాయకత్వంలోని అఫ్గానిస్తాన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి అబ్బురపరిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (60 బంతుల్లో 49; 5 ఫోర్లు), కెప్టెన్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 39; 3 ఫోర్లు), సమరవిక్రమ (40 బంతుల్లో 36; 3 ఫోర్లు), తీక్షణ (31 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫారూఖీ (4/34) శ్రీలంక జట్టును దెబ్బ తీశాడు. ఒకదశలో 134/2తో పటిష్టస్థితిలో కనిపించిన శ్రీలంక నిసాంక అవుటయ్యాక తడబడింది. 107 పరుగుల తేడాలో ఏడు వికెట్లు కోల్పోయింది. కెరీర్‌లో 100వ వన్డే ఆడిన రషీద్ ఖాన్ ఒక వికెట్ తీయగా, మరో స్పిన్నర్ ముజీబ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యాన్ని అఫ్గానిస్తాన్ 45.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గుర్బాజ్ (0) డకౌట్‌కాగా... రహ్మత్ షా (74 బంతుల్లో 62; 7 ఫోర్లు), హష్మతుల్లా షాహిది (74 బంతుల్లో 58 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (63 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో అఫ్గానిస్తాన్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. హష్మతుల్లా, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు అజేయంగా 111 పరుగులు జోడించడం విశేషం.

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిపోయిన అఫ్గానిస్తాన్... రెండో మ్యాచ్‌లో 69 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి బోణీ కొట్టింది. మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 149 పరుగుల తేడాతో ఓడిపోయి... నాలుగో మ్యాచ్‌లో విజృంభించి 1992 విశ్వవిజేత పాకిస్తాన్‌పై ఏకంగా 8 వికెట్ల తేడాతో గెలిచింది. అనంతరం అదే ఉత్సాహంతో శ్రీలంకను కూడా మట్టికరిపించి అఫ్గానిస్తాన్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మూడోసారి వన్డే వరల్డ్‌కప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఒకే ప్రపంచకప్‌లో మూడు విజయాలు సాధించడం ఇదే ప్రథమం. 2015 ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్‌లో నెగ్గిన అఫ్గానిస్తాన్... 2019 ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ ప్రపంచకప్‌లో మాత్రం అఫ్గానిస్తాన్ తమ కంటే మెరుగైన జట్లకు చెమటలు పట్టిస్తోంది. ఈ టోర్నీలో అఫ్గానిస్తాన్ మిగిలిన మూడు మ్యాచ్‌లను నెదర్లాండ్స్ (నవంబర్ 3న), ఆస్ట్రేలియా (నవంబర్ 7న), దక్షిణాఫ్రికా (నవంబర్ 10న) జట్లతో ఆడుతుంది.


అజ్మతుల్లా


రహ్మత్ షా


హష్మతుల్లా

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 46; దిముత్ కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫారూఖీ 15; కుశాల్ మెండిస్ (సి) నజీబుల్లా (సబ్) (బి) ముజీబ్ 39; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 36; అసలంక (సి) రషీద్ ఖాన్ (బి) ఫారూఖీ 22; ధనంజయ డిసిల్వా (బి) రషీద్ ఖాన్ 14; ఏంజెలో మాథ్యూస్ (సి) నబీ (బి) ఫారూఖీ 23; చమీర (రనౌట్) 1; తీక్షణ (బి) ఫారూఖీ 29; కసున్ రజిత (రనౌట్) 5; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 241. వికెట్ల పతనం: 1–22, 2–84, 3–134, 4–139, 5–167, 6–180, 7–185, 8–230, 9–239, 10–241. బౌలింగ్: ముజీబ్ ఉర్ రెహ్మాన్ 10–0–38–2, ఫజల్లహ్ ఫారూఖీ 10–1–34–4, నవీన్ ఉల్ హక్ 6.3–0–47–0, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 7–0–37–1, రషీద్ ఖాన్ 10–0–50–1, నబీ 6–0–33–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: రహ్మానుల్లా గుర్బాజ్ (బి) మదుషంక 0; ఇబ్రహీమ్ జద్రాన్ (సి) కరుణరత్నే (బి) మదుషంక 39; రహ్మత్ షా (సి) కరుణరత్నే (బి) రజిత 62; హష్మతుల్లా షాహిది (నాటౌట్) 58; అజ్మతుల్లా (నాటౌట్) 73; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (45.2 ఓవర్లలో మూడు వికెట్లకు) 242. వికెట్ల పతనం: 1–0, 2–73, 3–131. బౌలింగ్: మదుషంక 9–0–48–2, రజిత 10–0–48–1, మాథ్యూస్ 3–0–18–0, చమీర 9.2–0–51–0, తీక్షణ 10–0–55–0, ధనంజయ డిసిల్వా 4–0–21–0.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ X బంగ్లాదేశ్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
పాకిస్తాన్	6	2	4	4	-0.387
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

అనీశ్ డబుల్ ధమాకా

కాంస్య పతకంతోపాటు పారిస్ ఒలింపిక్ బెర్త్ సొంతం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత యువ షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకం సాధించాడు. ఆరుగురి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 21 ఏళ్ల అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంతో ముగించాడు. ఈ ప్రదర్శనతో అనీశ్ వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖరారు చేసుకున్నాడు. ఇప్పటి వరకు షూటింగ్‌లో భారత్‌కు 12 ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి. మరోవైపు పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టుకు రజత పతకం దక్కింది. కైనన్, జొరావర్, పృథ్వీరాజ్ బృందం 341 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 30 పతకాలు సాధించింది.

వెర్‌స్టాపెన్ రికార్డు

ఈ సీజన్‌లో 16వ విజయం



మెక్సికో సిటీ: ఇప్పటికే ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నప్పటికీ... రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మాత్రం ఫార్ములావన్–2023 సీజన్‌లో ఎదురులేకుండా దూసుకుపోతున్నాడు. మెక్సికో గ్రాండ్‌ప్రి రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును మూడో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ తొలి మలుపు వద్ద ప్రత్యర్థి డ్రైవర్లను ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత రేసు చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ 71 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 2 గంటల 2 నిమిషాల 30.814 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 16వ గెలుపు కావడం విశేషం. తద్వారా ఒకే ఏడాది అత్యధిక ఎఫ్1 రేసుల్లో గెలిచిన డ్రైవర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. గత ఏడాది వెర్‌స్టాపెన్ 15 రేసుల్లో గెలుపొందాడు. ఓవరాల్‌గా వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 51వ విజయం. ఈ క్రమంలో కెరీర్‌లో అత్యధిక ఎఫ్1 విజయాలు సాధించిన డ్రైవర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న అలైన్ ప్రాస్ట్ (ఫ్రాన్స్) సరసన నిలిచాడు.

లెక్క సరిచేసిన భారత్



రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' సాధించింది. చైనా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), సలీమా టెటె (26వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా జట్టుకు జాంగ్ జియాకి (41వ ని.లో) ఒక గోల్ అందించింది. ఈ గెలుపుతో ఇటీవల హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా జట్టు చేతిలో సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



పనాజీ: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ ఈవెంట్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ చాంపియన్‌గా అవతరించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 13.22 సెకన్లలో అందరికంటే వేగంగా ఫైనల్ రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు తెలంగాణ ఖాతాలో 11వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ రజత పతకం సాధించింది.

సినిమా

అమ్మాడీ...


● మృణాల్ ఠాకూర్, నాని

మాట రూపంలో కాకుండా ఇంకాస్త ఎక్కువగా ప్రేమను వ్యక్తపరచాలనుకున్నప్పుడు హీరో హీరోయిన్ పాట పాడుకోవడం చూస్తుంటాం. మృణాల్ ఠాకూర్‌పై నాని అలాంటి ప్రేమనే వ్యక్తపరిచారు. ప్రేమను వ్యక్తపరుస్తూ 'అమ్మాడీ...' అంటూ ఆమెను ఉద్దేశించి పాడారు నాని. 'హాయ్ నాన్న' చిత్రంలోని ఈ పాటను నవంబర్ 4న రిలీజ్ చేయనున్నారు. నాని, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. నాని కుమార్తెగా బేబీ కియారా ఖన్నా నటించింది. ఈ చిత్రం కోసం హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన పాటల్లో తొలి పాట 'సమయమా..', రెండో పాట 'గాజు బొమ్మ..'ను ఇప్పటికే రిలీజ్ చేశారు. 'అమ్మాడీ...' మూడో పాట. నాని, మృణాల్ మధ్య సాగే రొమాంటిక్ సాంగ్ ఇది అని యూనిట్ పేర్కొంది. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించారు. డిసెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్ ఐఎస్‌సీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

కౌంట్ డౌన్ స్టార్ట్


● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' జనవరి 13న సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కాగా ఇది వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. తాజాగా 'సైంధవ్' విడుదలకు కౌంట్ డౌన్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. సినిమా విడుదలకు ఇంకా 75 రోజులు ఉంది. సంతోష్ నారాయణన్ ఈ చిత్రం కోసం అద్భుతమైన ఆల్బమ్ సిద్ధం చేశారు. త్వరలో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

ప్రేక్షకులకు పది రెట్ల థ్రిల్ గ్యారంటీ - అనిల్ విశ్వనాథ్



''మా ఊరి పొలిమేర' తొలి భాగం ఓటీటీలో రిలీజ్ కావడంతో ప్రేక్షకుల స్పందన పెద్దగా తెలియలేదు. సినిమా చూసి, చాలామంది బాగుందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శుభలేఖ సుధాకర్‌గారు ఫోన్ చేసి, 'దర్శకుడిగా నీకు మంచి భవిష్యత్ ఉంటుంది' అని చెప్పడంతో నాపై నాకు మరింత నమ్మకం పెరిగింది'' అని డైరెక్టర్ డా. అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర–2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే రెండో భాగం మొదలవుతుంది. తొలి భాగం హిట్టవ్వడంతో సీక్వెల్‌పై అంచనాలు పెరిగాయి. అందుకే పార్ట్ 2 స్క్రీన్‌ప్లేను మరింత బలంగా తయారు చేశాను. తొలి భాగంతో పోల్చితే ప్రేక్షకులు దాదాపు పది రెట్ల థ్రిల్ ఫీలవుతారు. వంశీ నందిపాటిగారి సహకారంతో మా చిత్రాన్ని ఘనంగా రిలీజ్ చేస్తున్నాం. 'బన్నీ' వాసుగారికి నచ్చడంతో మా సినిమా పెద్ద రేంజ్‌కు వెళ్లింది. 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. అంతకన్నా ముందు వేరే జానర్‌లో ఓ సినిమా చేస్తా'' అన్నారు.

ప్రేమకథ షురూ


● నాగచైతన్య, అలేఖ్య హారిక, సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా కొత్త సినిమా షురూ అయింది. సుమన్ పాతూరి దర్శకత్వంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి డైరెక్టర్ చందూ మొండేటి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్ కొట్టగా, డైరెక్టర్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహించారు. డైరెక్టర్ హరీష్ శంకర్, నిర్మాత రవిశంకర్ యూనిట్‌కి స్క్రిప్ట్ అందించగా, హీరో సుశాంత్, దర్శకులు హను రాఘవపూడి, రాహుల్ సంకృత్యాన్ యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మంచి ప్రేమకథ ఉంటుంది'' అన్నారు. ''నా మనసుకు దగ్గరైన కథ ఇది. నేను, ఎస్‌కేఎన్, సందీప్ రాజ్, అలేఖ్య.. మేమంతా ఫ్రెండ్స్. ఈ సినిమా వారితో కలిసి చేస్తుండటంతో మరింత బాధ్యతగా భావిస్తున్నా'' అన్నారు సాయి రాజేశ్. ''ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఇచ్చిన నా ఫ్రెండ్ సాయి రాజేశ్‌కు థ్యాంక్స్'' అన్నారు సుమన్ పాతూరి. ''హీరోయిన్‌గా చేయాలనే నా కల ఈ చిత్రంతో నెరవేరుతోంది'' అన్నారు అలేఖ్య హారిక. ''తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించాలనే నా సినిమాల్లో తెలుగు అమ్మాయిలనే హీరోయిన్‌గా తీసుకుంటున్నాను'' అన్నారు ఎస్‌కేఎన్. ఈ చిత్రానికి కెమెరా: అస్కర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, సహనిర్మాతలు: ధీరజ్ మొగిలినేని, రమేశ్ పెద్దింటి.

మమ్మల్ని సినిమా కలిపింది - విజయ్ దేవరకొండ


● బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్, సాయికృష్ణ

''నేను, దర్శకులు నాగ్ అశ్విన్, తరుణ్ భాస్కర్, సందీప్ రెడ్డి వంగా వేర్వేరు చోట్ల పెరిగాం. మా నేపథ్యాలు వేరు.. మమ్మల్ని సినిమా కలిపింది. 'పెళ్ళి చూపులు'తో నన్ను హీరోగా పరిచయం చేశాడు తరుణ్ భాస్కర్. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో కొందరు కొత్తవాళ్లకు కెరీర్ ఇచ్చాడు. ఇప్పుడు 'కీడా కోలా'లోనూ ప్రతిభ ఉన్న కొత్తవాళ్లు కనిపిస్తున్నారు. తరుణ్‌కి తనపై, తన కథలపై చాలా నమ్మకం. ఈ విషయంలో అతన్ని గౌరవిస్తాను. ఇండస్ట్రీకి దొరికిన అదృష్టం తను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కీడా కోలా'. రానా సమర్పణలో కె. వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''తరుణ్ భాస్కర్‌పై ఉన్న నమ్మకంతో చెబుతున్నా.. 'కీడా కోలా' మజా ఇస్తుంది. తర్వలో మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుంది'' అన్నారు. సీనియర్ నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ–''డైరెక్టర్ జంధ్యాలగారి సినిమాలు చేస్తున్నప్పుడు వినోదం ఎంత హాయిగా పండిందో మళ్లీ 'కీడా కోలా'కి అలాంటి అనుభూతి కలిగింది'' అన్నారు. ''నా 'పెళ్ళి చూపులు, ఈ నగరానికి ఏమైంది' చిత్రాల విడుదలప్పుడు చిన్న భయం ఉండేది. ప్రేక్షకుల స్పందన తెలుసుకునేందుకు థియేటర్ బయటే తిరిగేవాడిని. 'కీడా కోలా' విషయంలో ఆ భయం లేదు'' అన్నారు తరుణ్ భాస్కర్. ''రెండు గంటల పాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు నిర్మాతలు సాయికృష్ణ గద్వాల్, శ్రీపాద్.

ఒకేసారి ఐదు సినిమాలు ఒక సంచలనం - బ్రహ్మానందం


● అచ్యుతరావు, బ్రహ్మానందం, ఉపేంద్ర

''ఒక సినిమా తీయడానికే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం ఓ సంచలనం. తన కుమారుడు ఉపేంద్రని హీరోగా పరిచయం చేయడంతో పాటు ఒకేసారి అతనితో ఐదు సినిమాలు తీస్తున్న అచ్యుతరావుకి అభినందనలు. దీనివల్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి అవకాశాలు ఇచ్చి, భోజనం పెట్టినట్లవుతుంది. 'ఉపేంద్రగాడి అడ్డా' మంచి హిట్టవ్వాలి'' అని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహించిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై, 'ఉపేంద్రగాడి అడ్డా' ట్రైలర్‌ను, '1920 భీమునిపట్నం' పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఉపేంద్ర హీరోగా ఇదే బ్యానర్‌లో తీస్తున్న ఐదు సినిమాల టీజర్లను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నవంబర్ నుంచి ప్రతీ నెల ఒక సినిమాను విడుదల చేయబోతున్నాం'' అన్నారు. ''నా పుట్టిన రోజుకి ఇది వెలకట్టలేని పెద్ద బహుమతి'' అన్నారు కంచర్ల ఉపేంద్ర. ''సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తోందో మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. హీరోయిన్ సావిత్రీ కృష్ణ, సహనిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత పాల్గొన్నారు.

కథని నమ్మి చేశాం - శ్రీరామ్


● అవసరాల, ఖుషీ, శ్రీరామ్, సాయికిరణ్, కోన వెంకట్

''పిండం అనేది జననానికి, మరణానికి సంబంధించినది. ఈ 'పిండం' సాయి కిరణ్ లాంటి ప్రతిభగల దర్శకుడి పుట్టుకకు (ఇండస్ట్రీలో) కారణం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు రచయిత, నిర్మాత కోన వెంకట్. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. కళాహి మీడియాపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు కోన వెంకట్. మరో అతిథి బీవీఎస్ రవి (రచయిత, దర్శకుడు) మాట్లాడుతూ– ''ఈ సినిమా టీజర్, నిర్మాణ విలువలు బాగున్నాయి. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథని నమ్ముకొని చేసిన చిత్రం 'పిండం'. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన ఇద్దరు పిల్లల నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''కళాహి మీడియా బ్యానర్‌పై 'పిండం'లాంటి మంచి సినిమాలు మరిన్ని చేస్తాం'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. ''ఇదొక ఇంటెన్స్ హారర్ ఫిల్మ్'' అన్నారు సాయి కిరణ్ దైదా. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, కెమెరామేన్ సతీష్ మనోహర్ తదితరులు మాట్లాడారు.

అంబాజీపేట సంతృప్తి ఇచ్చింది - సుహాస్


● సుహాస్, శివానీ నాగరం

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ఫ్రెష్ సబ్జెక్ట్. సినిమా కొత్తగా ఉంటుంది. నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. ఒక మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అని సుహాస్ అన్నారు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మించాయి. ఈ చిత్ర సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన 'గుమ్మా....' అంటూ సాగే తొలి పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ– ''ఈ పాటకి రెహ్మాన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. ఈ సినిమాలోని పాటలన్నీ బాగుంటాయి'' అన్నారు. ''జనవరి నెలాఖరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని. ''మంచి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. 'అంబాజీపేట..' హిట్ కావాలి'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. నటులు జగదీశ్, నితిన్, డ్యాన్స్ మాస్టర్ మోయిన్ తదితరులు మాట్లాడారు.